# వలంటీర్లే.. ప్రచారాస్త్రాలు

- రాజీనామా చేయించి రంగంలోకి దించేందుకు ఏర్పాట్లు
- వైసీపీ నాయకులే నెల జీతాలు ఇచ్చేందుకు ఒప్పందాలు
- వారంరోజుల్లో మొత్తం వలంటీర్ల రాజీనామాలతో ప్రణాళిక
- క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న 11273మంది వలంటీర్లు

తుని రూరల్, ఏప్రిల్ 6: వలంటీర్లు వైసీపీ సైన్యం అంటూ సాక్షాత్తూ సీఎం జగన్ బహిరంగంగా ప్రకటించారు. ఈ మాటలను ఇప్పుడు వలంటీర్లు నిజం చేస్తున్నారు. వీరిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచడం.. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై వేటు వేయడంతో రాజీనామాల పర్వానికి తెరతీశారు. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే.. ఇప్పుడు రాజీనామా చేసి ఎన్నికలో పాల్గొంటే తర్వాత మీ ఉద్యోగం మీకు దక్కుతుందని వైసీపీ నాయకులు ఒత్తిడి తీసుకురావడంతో జిల్లాలో చాలాచోట్ల వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నారు. తుని నియోజకవర్గంలోని 300మందికి పైబడి రాజీనామా పత్రాలను స్థానిక అధికారులకు అందజేశారు.

## నాయకులే జీతాలు ఇచ్చేలా ఒప్పందం

ఇప్పటికే వలంటీర్లు నాయకుల ప్రచారాల్లో కార్యకర్తల్లా పాల్గొంటున్నారు. పరోక్షంగా పథకాల పేరుతో ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. వారు విధుల్లో ఉండి ప్రచారం చేయడం నియమావళికి విరుద్ధం కావడంతో వైసీపీ కొత్త వ్యూహం తెరపైకి తీసుకొచ్చింది. రాజీనామా చేసిన వలంటీర్‌కు జీతం రానందున నాయకులే వీరికి కొంత మొత్తంలో నగదు ఇచ్చేలా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో వలంటీర్లకు తాయిలాలు అందాయి. ఒక్క తునిలోనే 1700మంది వలంటీర్లకు సెల్‌ఫోన్‌లు పంపిణీ చేయడం పలు విమర్శలకు తావిచ్చింది. ఎన్నికల వరకు ప్రభుత్వ పథకాల గురించి వైసీపీ రాకుండా పథకాలు ఆగిపోతాయని ప్రచారం చేయడంతోపాటు టీడీపీ వస్తే వాటిని రద్దు చేస్తారని నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే వారి పని. మీరు జగన్‌కు ఓటు వేశారో లేదో మాకు తెలుస్తుంది. ఓటు వేయకపోతే పథకాలు ఆపేస్తాం.. అని వారికి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ రాకముందే వలంటీర్లతో విందు భోజనాలతోపాటు తాయిలాలు చక్కబెట్టేశారు. ఎన్నికల సమయంలో ప్రచార కార్యక్రమాల్లో వలంటీర్లను దూరం చేయడం వైసీపీ నాయకులకు రుచించలేదు. వలంటీర్లతో ప్రచారానికి ఎలాంటి అడ్డంకులూ ఉండకూడదనే రాజీనామా పర్వాలు తెరతీశారు. అనుకున్నదే తడవుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వీర విధేయులుగా ఉన్న వలంటీర్లతో తొలుత రాజీనామాలు చేయిస్తున్నారు. అక్కడితో ఆగకుండా మిగిలిన వారితో రాజీనామాలు చేయిస్తున్నారు. ఇష్టం లేకపోయినా గుంపులో కలిసిపోయి రాజీనామాలు చేస్తున్నారు. ఇదే ఒరవడి తుని నియోజకవర్గానికి పాకింది. ఇక్కడ మూడు రోజులుగా రాజీనామాల పర్వం కొనసాగుతోంది. ఇప్పటికే నియోజకవర్గంవ్యాప్తంగా 300మందికి పైబడి రాజీనామాలు చేసినట్లు అధికారులు ప్రకటిస్తున్నారు. నియోజకవర్గాల పరిధిలో ఆ పార్టీ నేతలు గ్రామాలవారీగా వలంటీర్లతో రహస్య మంతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వారంవ్యవధిలో జిల్లాలో వలంటీర్లతో రాజీనామా చేయిస్తున్నట్లు తెలుస్తోంది. చాలామంది రాజీనామాలకు కారణాలు చూపకుండానే లేఖలు ఇవ్వడంతో వాటిని ఆమోదించాలా.. లేదా అనే సందిగ్ధంలో అధికారులు ఉన్నారు.

### తాటిపర్తిలో వలంటీర్లు రాజీనామా

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 6: ఎన్నికల ముందు వైసీపీ రకరకాల కుయుక్తులను పన్నుతోంది. ఇందులో వలంటీర్లను పావులుగా చేసుకొంది. వారితో రాజీనామాలు చేయించి ప్రతిపక్షాలపై దుష్ప్రచారం చేయడంతోపాటు వారిని రాజకీయంగా వినియోగించుకునేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులోభాగంగానే జిల్లావ్యాప్తంగా వలంటీర్లతో రాజీనామాలు చేయిస్తున్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని సచివాలయం 1, 2 పరిధిలో 53మంది వార్డు వలంటీర్లు తమ పదవులకు శనివారం రాజీనామాలు చేశారు. ఈ మేరకు వార్డు సచివాలయ అడ్మిన్‌కు సామూహికంగా రాజీనామాలు అందజేశారు. రాజీనామాలను ప్రత్యక్షంగా ఇవ్వాలని అడ్మిన్ రాజేంద్ర సూచించారు. దీంతో 37మంది ప్రత్యక్షంగా హాజరై తమ రాజీనామాలను అందజేశారు. మరో 16మంది హాజరుకాలేదు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే తాము వలంటీర్లుగా చేరామని వారు తెలిపారు. తమను చులకన చేసేలా కొన్ని రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడడం తమను మనస్తాపానికి గురిచేసిందని వారు చెప్పారు.



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో రాజీనామా చేసిన వలంటీర్లు

### క్షేత్రస్థాయిలో 11273 మంది వలంటీర్లు

జిల్లాలో 21మండలాల్లో 620 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో 11,273మంది వలంటీర్లుగా సేవలు అందిస్తున్నారు. వలంటీర్లు రాజీనామాలు చేసిన వెంటనే విపక్ష పార్టీలపై దుష్ప్రచారమే లక్ష్యంగా రంగంలోకి దిగుతున్నారు. గతంలో పింఛన్ సొమ్ము మేము ఇంటికి తీసుకొచ్చే వాళ్లమని, చంద్రబాబు కూటమి నాయకులు చేసిన కుట్రతో ఇక నుంచి అందే పరిస్థితి లేదని దీన్ని అంగీకరిస్తారా.. ఇలాగే మీరు సచివాలయాలవద్ద కూర్చొని గంటల కొద్దీ వేచి ఉండి పింఛన్లు తీసుకుంటారా... లేకపోతే వలంటీర్లు కావాలని కోరుకుంటారా.. మరోమారు మీ ఇంటికి ప్రభుత్వ పథకాలు రావాలంటే జగన్‌కే ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

# లెక్క తేల్చారు



- జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారుల ముమ్మర కసరత్తు
- నియోజకవర్గాల వారీగా పోలింగ్ బూత్‌లు, ఈవీఎంలు, సిబ్బంది అవసరంపై అంచనాలు పూర్తి
- ఎన్నికల నిర్వహణ ప్రణాళిక నివేదికను ఈసీకి పంపిన జిల్లా కలెక్టర్
- ఏడు నియోజకవర్గాలకు 1,640 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు ప్రతిపాదన
- మొత్తం క్రిటికల్ బూత్‌లు 366 గుర్తింపు: అత్యధికంగా పిఠాపురంలో 71
- ఎన్నికల నిర్వహణకు మొత్తం 11,766మంది సిబ్బంది అవసరమని అంచనా

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల సమర్థ నిర్వహణకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో నియోజకవర్గాలవారీగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఎన్నికల సిబ్బంది, పోలీసు భద్రత, ఈవీఎంల వినియోగం తదితర అంశాలపై ఇప్పటికే పూర్తిస్థాయి మదింపు చేపట్టారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించి క్రిటికల్ పోలింగ్ బూత్‌లను గుర్తించి అక్కడ ఏవిధమైన శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో ఎన్నికలు పక్కాగా నిర్వహించేందుకు ఆయా విభాగాలవారీగా ప్రణాళిక నివేదికను ఎట్టకేలకు సిద్ధం చేశారు. దీన్ని జిల్లా కలెక్టర్ నివాస్ తాజాగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పంపించారు. ఇందులోభాగంగా రాష్ట్రంలో జిల్లాల విభజన జరిగిన తర్వాత నిర్వహిస్తున్న తొలిఅసెంబ్లీ ఎన్నికలు కావడంతో జిల్లాలో మొత్తం 1,640బూత్‌లను సిద్ధం చేస్తున్నారు.

## అక్కడే క్రిటికల్..

ఈసీకి జిల్లా కలెక్టర్ పంపిన 130పేజీల నివేదికలో అనేక కీలకాంశాలను ప్రస్తావించారు. అవసరమైన పోలింగ్ సిబ్బంది నుంచి ఈవీఎంల వరకు మదింపు చేపట్టి సవివరంగా పేర్కొన్నారు. దీని ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్లు 16.18లక్షలు కాగా, ఇందులో పురుషులు 7.97 లక్షలు, మహిళలు 8.21లక్షల మంది ఉన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి మొత్తం 1,640 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని ఈసీకి ప్రతిపాదించారు. ఇందులో తుని నియోజకవర్గంలో 224బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్తిపాడు 227, పిఠాపురం 242, కాకినాడ రూరల్ 264, పెద్దాపురం 201, కాకినాడ సిటీ 234, జగ్గంపేట 248 చొప్పున ప్రతిపాదించారు. ఇవికాకుండా జిల్లాల విభజన తర్వాత కాకినాడ జిల్లా పరిధిలోకి అనపర్తి నియోజకవర్గానికి చెందిన పెదపూడి మండలం చేరింది. దీంతో ఇక్కడ 64బూత్‌లు, రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలంలో 70, ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు 75 ప్రతిపాదించారు. ఇవి కూడా కలిపి మొత్తం 1782 పోలింగ్ బూత్‌లు అవసరం అని లెక్కించారు. ఈ బూత్‌లో గత ఎన్నికల్లో జరిగిన సంఘటనల ఆధారంగా క్రిటికల్ పోలింగ్ బూత్‌లను గుర్తించారు. ఈ అసెంబ్లీ ఎన్నికలనుంచి క్రిటికల్ బూత్‌లు అనే పదం ప్రస్తావిస్తున్నారు. దీనిప్రకారం జిల్లాలో మొత్తం క్రిటికల్ పోలింగ్‌స్టేషన్లు 366గా గుర్తించారు. ఇందులో తుని నియోజకవర్గం పరిధిలో 56, ప్రత్తిపాడు 45, పిఠాపురం 71, కాకినాడ రూరల్ 33, పెద్దాపురం 46, కాకినాడ సిటీ 40, జగ్గంపేట 25, అనపర్తి 19, రామచంద్రపురం 19, ముమ్మిడివరం 12 చొప్పున ఉన్నాయి. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల సిబ్బంది పరంగా ఏడుగురు ఆర్వోలు, 29మంది ఏఆర్వోలు, 168సెక్టార్ ఆఫీసర్లు అవసరమని నివేదికలో ప్రస్తావించారు. 1,640 మంది బూత్‌లెవెల్ ఆఫీసర్లు కావాలని ప్రతిపాదించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో 80శాతం పైగా పోలింగ్ నమోదైనట్లు గణాంకాల్లో పేర్కొన్నారు. కానీ కాకినాడ సిటీలో 2019ఎన్నికల్లో అత్యల్పంగా 66.77శాతం పోలింగ్ జరిగింది. అత్యధికంగా జగ్గంపేటలో 85.71 పోలింగ్‌శాతం నమోదైంది. వచ్చేనెల్లో జరగనున్న ఎన్నికల్లో శాంతిభద్రతల పరంగా ఒక్క పిఠాపురంలో కాకినాడ సెజ్‌కు సంబంధించిన ఆందోళనలు జరిగే అవకాశం ఉందని అంచనా వేశారు.

## ఈవీఎంలు సిద్ధం..

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు ఈనెల 25న చివరి తేదీ. 26న నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణకు 29 ఆఖరు తేదీ. పోలింగ్ మే 13న జరగనుంది. ఈ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, అనపర్తి, ముమ్మిడివరం, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మూడు మండలాలకు కలిపి మొత్తం 11,766మంది పోలింగ్ సిబ్బంది అవసరమని గుర్తించారు. వీరిలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఫస్ట్ పోలింగ్ ఆఫీసర్లు, సెకండ్, థర్డ్ ఒక్కోదానికి 1,785 చొప్పున కావాలని పేర్కొన్నారు. మహిళా పోలింగ్ సిబ్బంది 3,570 అవసరమని గుర్తించారు. పోలింగ్ విధులకు 3,584మంది రాష్ట్ర పోలీసులు అవసరమని, వీరు అందుబాటులో ఉన్నారని కలెక్టర్ తన నివేదికలో పేర్కొన్నారు. వీరు కాకుండా ఇతర భద్రతా సిబ్బంది కలిపి మొత్తం 6,088 అవసరమని అంచనా వేశారు. అటు పోలింగ్‌రోజు ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు 3,937 అవసరమవుతాయని నివేదికలో పేర్కొన్నారు. తుని నియోజకవర్గంలో 538, ప్రత్తిపాడు 545, పిఠాపురం 581, కాకినాడ రూరల్ 634, పెద్దాపురం 482, కాకినాడ సిటీ 562, జగ్గంపేట 595 చొప్పున ఈవీఎంలు వినియోగించాల్సి ఉంటుందని ప్రస్తావించారు. వీటన్నింటికీ సంబంధించి ఈవీఎంల అందుబాటు, వాటి గోడౌన్ల తనిఖీలు అన్నీ ఎప్పటికప్పుడు చేస్తున్నట్లు వివరించారు.

# చెరువునూ వదల్లేదు!

- నేమాంలో రాములు చేపల చెరువుపై సర్పంచ్ కన్ను
- మంచినీటి చెరువంటూనే చేపల పెంపకం
- మత్స్యకారుల జీవనోపాధిపై అక్కసు
- న్యాయం కోరినా పట్టించుకోని ఎమ్మెల్యే కన్నబాబు



కాకినాడ రూరల్‌లోని నేమాం జగన్మోహనపురంలో రాములు చేపల చెరువు

సర్పవరం జంక్షన్(కాకినాడ), ఏప్రిల్ 6: వారంతా మత్స్యకారులు. గంగమ్మతల్లినే నమ్ముకుని సముద్రంలో చేపలవేట, చెరువుల్లో చేపలు పెంచుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నారు. చెరువుల్లో చేపలపై లభిస్తున్న ఆదాయంపై అధికార పార్టీకి చెందిన స్థానిక సర్పంచ్ కన్నుపడింది. ఎలాగైనా సరే చెరువులను సొంతం చేసుకోవాలనుకుని, కాలనీవాసులకు మంచినీటి చెరువు కోసమంటూ మత్స్యకారులను నమ్మబలికి, చేపలచెరువుగా మార్చేసి రూ.లక్ష వెచ్చించి చేపల పిల్లలు పెంచుతున్నారు. నేడో రేపో చేపల పట్టేందుకు సదరు సర్పంచ్ ప్రయత్నాలు చేస్తుండడం, మంచినీరు చెరువులో చేపలు పెంచడం, సొసైటీ సభ్యులకు చెరువు ఇవ్వకుండా అడ్డగోలుగా చేపల పెంపకంపై మత్స్యకారులు న్యాయం చేయాలంటూ ప్రజాప్రతినిధివద్ద పంచాయతీ పెట్టినా ఫలితం లేకపోయింది. దీంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఎమ్మెల్యేవద్ద నిరసన తెలిపారు. ఆయన పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. చేపల చెరువును తమకు దూరం చేసి అక్రమంగా చేపలు పెంచి లక్షలాది రూపాయలు కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్న సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

## మత్స్యకారులకు చెరువులు దూరం

కాకినాడ రూరల్ మండలం నేమాంలో 11 చెరువులున్నాయి. ఈ చెరువులను మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత్స్య సహకార సొసైటీలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్థానిక ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులకు పంచాయతీనుంచి లీజుకు ఇస్తుంటారు. నేమాం-పోలవరానికి చెందిన మత్స్యకారులంతా కలిపి 500మంది సభ్యులతో ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీని మత్స్యశాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ 11 చెరువులకు కలిపి మూడేళ్లకు కలిపి రూ.1.20లక్షల వరకు లీజు ఉండేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ లీజు సొమ్మును ఉద్దేశపూర్వకంగా స్థానిక సర్పంచ్ 5లక్షలకు పెంచుతూ తీర్మానం చేశారు. 1974నుంచి తమ ఆధీనంలో ఉండే గ్రామంలోని చెరువులకు రూ.10వేల నుంచి 2019 వరకు రూ.లక్ష ఉండే లీజును అమాంతంగా నాలుగు రెట్లు పెంచడంతో మత్స్యకారులు నిరసన తెలిపారు. ఎట్టకేలకు నాలుగు చెరువులు తప్పించి రూ.4.20లక్షలకు లీజుగా నిర్ధారించారు. జగన్మోహనపురం లేఅవుట్‌లో ఏడెకరాల్లో ఉన్న రాములు చెరువు కాలనీవాసులకు మంచినీటి చెరువుగా ఆధునికీకరిస్తానంటూ చెప్పి మత్స్యకారులను ఒప్పించేలా సర్పంచ్ చేశారు. అనంతరం చెరువులో అడ్డగోలుగా మట్టి తవ్వేసి లక్షలాది రూపాయలు ఆర్జించుకున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చెరువులో అనధికారికంగా లక్ష రూపాయలతో చేప పిల్లలు వేసి చేపలు సాగు చేశాడన్నారు. 11 ఎకరాల విస్తీర్ణంలోని అక్క చెరువు అభివృద్ధికి లీజుకిస్తే ఇందులో తనకు రూ.11లక్షల కమిషన్ ఇవ్వాలని, లేదంటే చెరువు జోలికి వెళ్లవద్దంటూ అడ్డుకుని తమ ఆదాయంపై దెబ్బకొట్టాడన్నారు. దీనిపై ఎమ్మెల్యే కన్నబాబువద్ద పంచాయతీ పెట్టినా తమను పట్టించుకోలేదని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల ప్రచారానికి నేమాంకు వస్తే రాములోరి చెరువు విషయం తేల్చాలని కోరగా ఎమ్మెల్యే పట్టించుకోకుండా ముందుకెళ్లడంతో నిరసన తెలియజేశామన్నారు. చెరువులో చేపల పట్టుబడికి ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు తెలిపారు.

### ప్రశ్నిస్తే కేసులంటూ భయపెడుతున్నారు

చేపల చెరువులను సర్పంచ్ లాక్కున్నాడు. గ్రామంలో 11 చెరువులుండగా నాలుగు చెరువులను మాకు కాకుండా చేశారు. చిన్న చిన్న చెరువులను కప్పెటేసి ఇళ్లస్థలాలుగా ఇచ్చేశారు. ఆదాయం వచ్చే రాములు చెరువు కాలనీవాసుల తాగునీటికోసం అంటే వదులుకున్నాం. అక్రమంగా ఈ చెరువులో చేపలు పెంపకం చేస్తున్నారు. న్యాయం చేయాలని ఎమ్మెల్యే కన్నబాబు కోరినా పట్టించుకోకుండా సర్పంచ్‌కు వత్తాసు పలికారు. న్యాయంకోసం ప్రశ్నిస్తే ఎమ్మెల్యేనే అడ్డుకుంటారా అంటూ మీపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తానంటూ సర్పంచ్ బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

-పంతాడి సూర్యనారాయణ, వనమాడి శివరామకృష్ణ, ఫిషర్ మెన్ సొసైటీ అధ్యక్షుడు, గ్రామ పెద్దకాపు

# పిఠాపురంలో అఖండ మెజార్టీతో గెలవబోతున్నాం

- జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 6: పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అఖండ మెజార్టీతో విజయం సాధించబోతున్నారని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. పిఠాపురం మండలం గోకులం గ్రాండ్‌లో శనివారం ఆయన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ గెలుపులో భాగస్వాములైన ప్రతి నాయకుడు, కార్యకర్తకు గౌరవప్రదమైన స్థానం కల్పిస్తామన్నారు. సామాజిక బాధ్యతతో పనిచేసే పవన్‌కల్యాణ్‌వద్ద కార్యకర్తగా పనిచేసే అవకాశం ఒక్కరోజు దక్కినా అంతకు మించిన సంతృప్తి ఉండదని తెలిపారు. వివిధ వర్గాల ప్రముఖులు, సంఘాల ప్రతినిధులు నాగబాబును కలిశారు. పవన్ గెలుపు కోసం పనిచేయడానికి తమ సంసిద్ధత వ్యక్తం చేశారు. వీరికి తగు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు నాగబాబు తెలిపారు.

## బీజేపీ నేతలతో భేటీ

నాగబాబును పిఠాపురం అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, పలువురు పార్టీ నేతలు కలిశారు. వీరి మధ్య పలు అంశాలు చర్చకు వచ్చాయి. బీజేపీ నాయకులు దాట్ల సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, బుర్రి మురళీధరరావు, తోట ఏడుకొండలు పాల్గొన్నారు.

## సొంత వాళ్లే వైసీపీ ఓడిపోవాలనుకుంటున్నారు

అధికారంలో ఉన్న వైసీపీ వాళ్లే తమ పార్టీ ఓడిపోవాలని అనుకుంటున్న పరిస్థితి రాష్ట్రంలో ఉందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు అన్నారు. కాకినాడ పార్లమెంటరీ ఉమ్మడి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ నేతృత్వంలో జనసేన పార్లమెంటరీ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ప్రకృతి విధ్వంసం చేయొద్దని అడ్డుపడిన జర్నలిస్టులను ఇసుక లారీల కింద పడేసి తొక్కి చంపాలన్న ఎమ్మెల్యే ద్వారంపూడి లాంటివారిని ఓడించాలని పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్‌పై అకారణంగా నోరు పారేసుకున్న దుర్మార్గుడు ఎమ్మెల్యే ద్వారంపూడి అని దుయ్యబట్టారు. మైనింగ్ మాఫియాతో కాంట్రాక్టర్లవద్ద వందల కోట్లు దోచుకుంటున్న చలమలశెట్టి సునీల్ లాంటి వ్యక్తుల కంటే వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న ఉదయ్ లాంటి వారిని గెలిపించుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశాల్లో పార్టీ ఉపాధ్యక్షుడు మహేందరరెడ్డి, జాతీయ మీడియా అధికార ప్రతినిధి అజయకుమార్, పార్టీ నేతలు మర్రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీజేపీ నాయకులతో సమావేశమైన నాగబాబు

# ఏరులై పారుతున్న అక్రమ మద్యం

- నిద్ర మత్తులో ప్రభుత్వ యంత్రాంగం




తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్

తాళ్లరేవు, ఏప్రిల్ 6: తాళ్లరేవు మండలంలో అక్రమ మద్యం ఏరులై పారుతున్నా సంబంధిత స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సెబ్ స్టేషన్, కోరింగ పోలీస్ అధికారులు మత్తునిద్రలో ఉన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తీరప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో వేలంపాటల ద్వారా మద్యం షాపులు విచ్చలవిడిగా నిర్వహించడం ప్రజాస్వామిక విరుద్ధమని, దీనికి ప్రభుత్వాధికారులు వంతుపాడడం మరింత దారుణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. తీరప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో ప్రత్యేక రాజ్యాంగాలను అమలు చేస్తూ కట్టుబాట్లు మాటున అక్రమ మద్యం మాఫియా చెలరేగిపోతోంది. మాఫియా, సెబ్, పోలీసులు కుమ్మక్కై లక్షలు చేతులు మారుతున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామంలో మద్యం మాఫియా అక్రమంగా తరలింపు చేస్తూ మద్యంషాపులు నిర్వహించే వ్యక్తులు వైసీపీ అధికార పార్టీకి చెందినవారే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరింత విశేషమేమిటంటే స్థానిక ముమ్మిడివరం నియోజకవర్గం ప్రతినిధికే యానాంలో మద్యం షాపు ఉండడం దానిద్వారా ఎన్నికల సందర్భంగా మద్యాన్ని తాళ్లరేవు, కాట్రేనికోన, ఐ.పోలవరం, ముమ్మిడివరం మండలాలకు తరలిస్తున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు. యానాం మద్యాన్ని నియంత్రించేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో సుంకరపాలెం, అరటికాయలంక, పి.మల్లవరం, ఎదుర్లంక చెక్‌పోస్టులు ఉన్నాయి. యానాం అధికారులు నీలపల్లి వంతెన దిగువలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఇన్ని చెక్‌పోస్టులు కళ్లుగప్పి అక్రమ మద్యం జలరవాణా, ఇతర మార్గాల ద్వారా భారీగా తరలిపోతున్నట్లు తెలుస్తోంది. కోరింగ పోలీసులు బెల్టుషాపులపై దాడులు చేస్తున్నా తగ్గేదేలేదన్నట్లు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వాహకులకు సెబ్ అధికారులే మద్యం అమ్ముకోమని సలహాలు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గ్రామాల్లో మద్యం మాఫియా చీప్ లిక్కరు బాటిళ్లను రూ.200 నుంచి రూ.250కు బ్లాకులో అమ్ముతూ మాఫియా కోట్లకు పడగలు ఎత్తుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మద్యాన్ని అరికట్టే చర్యలను అధికారులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదులు తక్షణమే పరిష్కారం: కలెక్టర్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జె.నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్‌లు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 6: జిల్లాలో సీవిజిల్ యాప్‌కు వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ జె.నివాస్ వెల్లడించారు. శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముకేష్‌కుమార్ మీనా విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై వచ్చే అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఎంసీసీ కేసుల రిపోర్టు, ఎన్నికలసీజర్ మేనేజ్‌మెంట్, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల తనిఖీ వంటి అంశాలపై కమిషనర్‌కు వివరించారు. కేంద్ర రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చే ఆదేశాలను జిల్లాలో పటిష్ఠంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో తిప్పేనాయక్, డీఆర్డీవో పీడీ శ్రీరమణి, డీపీవో భారతి సౌజన్య, ఆర్వోలు పాల్గొన్నారు.


తిమ్మాపురం పరిధిలో పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత - 7లో

## గరుడవాహనంపై
# స్వామివారి గ్రామోత్సవం

● ఘనంగా అధ్యయనోత్సవాలు



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్సవాలు రెండోరోజు శనివారం ఘనంగా నిర్వహించారు.వసంత మండపంలో వేద పండితులు చతుర్వేద పారాయణం, ద్రవిడవేద పారాయణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పల్లకిపై స్వామివారు ఆలయ ప్రదక్షణ చేశారు. తిరువీధులలో స్వామివారు గరుడ వాహనంపై విహరించి భక్తులను కటాక్షించారు. అనంతరం రాత్రి చంగోలం పారాయణం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, మహిళల కోలాట ప్రదర్శన , అన్నమయ్య సంకీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అశేషభక్తజనం అధ్యాయనోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఉపకమీషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లు నిర్వహించారు.

## బాలబాలాజీ ఆదాయం రూ.1,61,038

మామిడికుదురు, ఏప్రిల్ 6: అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,61,038 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వైనతేయ నదిలో భక్తులు స్నానమాచరించి స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. స్వామివారిని 2694 మంది దర్శించుకుని 2017 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## శృంగారవల్లభస్వామి ఆలయానికి
# పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, ఏప్రిల్ 6: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,34,080, అన్నదాన విరాళాలు రూ.42,670, కేశఖండన ద్వారా రూ.5,760, తులాభారం రూ.100 వెరసి రూ.2,82,610 ఆదా యం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం ఛైర్మన్ కర్రి జగ దీష్, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమా చార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో అభివృద్ధి జీరో

● ఫ్లయ్ ఓవర్ ఇచ్చింది మేమే
● భూముల చదునులో రూ.400 కోట్లు కొట్టేసిన వైసీపీ
● కూటమి అభ్యర్థులను గెలిపించాలి
● రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి



రాజమహేంద్రిలో బీజేపీ కార్యాలయం ప్రారంభిస్తున్న సిద్ధార్థ్‌నాథ్‌సింగ్ , పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 6: రాష్ట్రంతో పాటు రాజమహేంద్రవరం ప్రజలు కూడా పరిపాలనలో మార్పు కోరుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ఐదేళ్ల గడిచినా రాష్ట్రంలో అభివృద్ధి లేదు. ఏ వర్గానికి సంక్షేమం లేదు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలో బీజేపీ పార్లమెంట్ కార్యాలయాన్ని శనివారం దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు ప్రారంభించి పూజలు చేశారు. పార్టీ కార్యాలయం వద్ద, ఆ తర్వాత ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో పురందేశ్వరి మాట్లాడారు. రాజమహేంద్రవరం అభివృద్ధి జీరో అని, మోరంపూడి వద్ద ఫ్లయ్ ఓవర్ ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమే తప్ప ఇక్కడి ప్రజాప్రనిధులు కాదనే సంగతి ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఆకాంక్షల మేరకు అభివృద్ధి జరగలేదు అనే భావన రాజమహేంద్రవరం ప్రజల్లో ఉందన్నారు. కేంద్రం భారీగా ఇళ్ల మంజూరు చేసినా ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగలేదన్నారు. జగనన్న కాలనీలు కోసం తక్కువ ధరకే భూసేకరణ చేసి ప్రభుత్వం నుంచి భారీగా డబ్బులు తీసుకోవడం చేశారన్నారు. భూములు చదును చేస్తున్నామని మూడు నుంచి నాలుగు వందల కోట్లు కొట్టేసి ప్రజలను మోసం చేశారు. దౌర్భాగ్యపు రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపడానికే బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. రాజమహేంద్రవరం ఇంతకు ముందున్న నాయకులు అలవి కాని వాగ్దానాలు చేశారని, రాజమండ్రి, కాకినాడ ట్విన్ సిటీలు చేస్తామని, పాశ్చాత్య దేశాలుగా చేస్తామని చెప్పిన వారు కనీసం పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తాను రాజమహేంద్రవరం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని కూటమి పార్టీల అభ్యర్థులను కలుపుకుంటూ ముందుకు వెళుతూ వారి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జి సిద్ధార్థనాథ్ సింగ్, పేరెళ్ల చంద్రశేఖర్ జీ, జిల్లా అధ్యక్షుడు దత్తు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంక దినకర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి ఇతర నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కరించుకుని
# సత్యదేవుడికి సీఎంఆర్ పట్టువస్త్రాలు అందజేత



సీఎంఆర్ అధినేత సత్యదేవుడికి అందించిన నూతన పట్టువస్త్రాలు

అన్నవరం, ఏప్రిల్ 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఈనెల 9న ఉగాది పర్వదినం పురస్కరించుకుని శనివారం విశాఖపట్నం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ పట్టువస్త్రాలను అందజేశారు. మూలవరులకు, క్షేత్ర పాలకులు సీతారాములు, వనదుర్గ, కనకదుర్గలు ధరించేందుకు వీటిని సమర్పించారు. దేవస్థానం ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, పీఆర్వో కృష్ణారావులకు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కంచి మూర్తి, ఇంద్రగంటి సుధీర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పీఆర్వో మాట్లాడుతూ ప్రతీ ఏటా ఉగాదికి సీఎంఆర్ అధినేత పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

## ఘనంగా స్వామివారి శాంతి కల్యాణం

అంతర్వేది, ఏప్రిల్ 6 : బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బహుళ ద్వాదశి పురస్కరించుకుని స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. తొలుత అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, మంగళధారణలను వైభవంగా భక్తుల గోవింద నృసింహనామస్మరణతో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి శాంతి కల్యాణం తిలకించి తరించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకస్వాములు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# నేటి నుంచి చింతలూరు నూకాంబికా జాతర



● కట్టుదిట్టమైన ఏర్పాట్లు
● 8న తీర్థ మహోత్సవం

ఆలమూరు, ఏప్రిల్ 6: గోదావరి జిల్లాలలో పేరుగాంచిన ప్రధా న జాతరలలో ఒకటైన బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా ఆలమూ రు మండలం చింతలూరు నూకాంబికా జాతర ఈనెల 7నుంచి ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 7న జాతర మహోత్సవం, 8న తీర్థమహోత్సవం, 9న ఉగాది ఉత్సవాలతోపాటు నెల రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా కట్టుదట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మద్దూరి శివరామకృష్ణ తెలిపారు. దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. లక్షలాదిమంది భక్తులు తరలిరానున్న ఈజాతరను సమర్థవంతంగా నిర్వహించాలని పలుశాఖల అధికారులతో సమన్వయ కమిటీలను కొత్తపేట ఆర్డీవో జీవీవీ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. చంటిపిల్లల దేవతగా కొలిచే నూకాంబికా అమ్మవారికి జాతర ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు, చెల్లించుకుని వారపోత, తుళ్లిబిళ్ల, కావిడి కోళ్లు, గండాదీపం ఇక్కడ ప్రధానంగా మొక్కులు తీర్చుకుంటారు. సాధారణంగా చంటిపిల్లల్లో వచ్చే ఆటలమ్మ, పొంగు వంటి వ్యాధులు అమ్మవారి ఆగ్రహంవల్ల వస్తాయని అందువలన ఈవ్యాధి సోకిన చంటిపిల్లలచేత ఈ మొక్కులు తీరుస్తుంటారు. ఈవ్యాధులు రానివారు అమ్మ వారి అనుగ్రహం ఉందని మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో పూర్వపు ఉభయగోదావరి జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు చింతలూరు తరలివస్తారు. జాతరకు వచ్చే భక్తుల కోసం రావులపాలెం, అమలాపురం, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం డీపోల నుంచి ఇక్కడికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆలమూరు ఎస్ఐ శ్రీనునాయక్ చెప్పారు.

## టి.కొత్తపల్లిలో పొన్నాడకు నిరసన సెగ

● పొన్నాడ డౌన్ డౌన్ అంటూ నినాదాలు

ఐ.పోలవరం, ఏప్రిల్ 6: ముమ్మిడివరం వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు టి.కొత్తపల్లిలో చుక్కెదురయ్యింది. శనివారం ఎన్నికల ప్రచారంలో ఆయనకు ఎమ్మార్పీఎస్ నిరసన సెగ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో ఎమ్మెల్యే నిబంధనలు ఉల్లంఘించి జగ్జీవన్‌రామ్ విగ్రహం ముసుగు తొలగించి పూలమాల వేయడంపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వద్దని వారించినా దండ వేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వేసిన దండను ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తొలగించి విగ్రహానికి ముసుగు వేశారు. ఎన్నికల నియమావళి అతిక్రమించారని ఎమ్మార్పీఎస్ ఆరోపించింది. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పొన్నాడతో వాగ్వివాదానికి దిగడంతో గందరగోళం ఏర్పడింది. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పొన్నాడ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మాదిగలకు అన్యాయంచేసిన పొన్నాడ అంటూ నినాదాలు చేశారు.





మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు కుమార్తెను సత్కరిస్తున్న శ్రీప్రకాష్ యాజమాన్యం

# కళలు విశ్వజననీయమైనవి

● మాజీ ప్రధాని పీవీ కుమార్తె సురభి వాణీదేవి
● శ్రీప్రకాష్‌లో ఆకట్టుకున్న హరివిల్లు

పెద్దాపురం, ఏప్రిల్ 6: కళలు విశ్వజననీయమైనవని భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ (తెలంగాణా) సురభీ వాణీదేవీ అన్నారు. స్థానిక రామారావుపేట శ్రీప్రకా ష్ సినర్జీస్ పాఠశాలలో నిర్వహించిన హరివిల్లు కార్యక్రమానికి ఆమె శనివారం హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడారు. కళలు మానవ జీవితానికి సన్నిహిత సంబంధం కలవని సంస్కృతి, ప్రతిబింబానికి ఒక దేశంకానీ, ఒకజాతికానీ ఎంత ఉన్నతమైనదో తెలియజేసేదే కళ అని అన్నారు. కళలచేత మానవ జీవితానికి వికాసం ఉందన్నారు. మనోవికాసానికి ఆనందానికి కళలు మార్గదర్శకాలన్నారు. శ్రీప్రకాష్ పాఠశాల కళలకు ఇంత ప్రాధాన్యం ఇవ్వడం గొప్పవిషయమన్నారు. ప్రముఖ డైరెక్టర్ తరుణ్‌భాస్కర్ తల్లి గీతాభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలో సైన్సు, ఆర్ట్స్ పట్టాలను పొందేవిధంగా తర్ఫీదు పొందారన్నారు. అలాగే విద్యార్థులు ఎంతో సృజనాత్మకంగా, కళాత్మకంగా తీర్చిదిద్దిన కళాఖండాలు ఎంతో బాగున్నాయని ప్రశంసించారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ రామగణేష్ మాట్లాడుతూ చిన్నారులకు బాల్యం నుంచే కళల పట్ల మక్కువ పెంచే విధంగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో హరివిల్లు పేరుతో ఇంత గొప్ప కళాత్మకమైన కార్యక్రమాన్ని నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈకార్యక్రమానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగిఉన్న వ్యక్తులు ముఖ్యఅతిథులుగా హాజరుకావడం చాలా సంతోషదాయకమన్నారు. దేశంలో అన్నిరాష్ట్రాల సంస్కృతులు, సంప్రదా యాలు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ హరివిల్లు అనే కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంప్కృతిక కార్యక్ర మాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఎల్‌సీ కర్రి పద్మశ్రీ, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్, కల్చరల్ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



# పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత

● 258 క్వింటాళ్ల బియ్యం సీజ్



బియ్యం లోడు వాహనాన్ని పట్టుకున్న ఎస్ఐ రవీంద్రబాబు, ఎంఎస్‌వో మమత

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 6: విశాఖజిల్లా నుంచి అక్రమంగా కాకినాడ పోర్టకి రవాణా అవుతున్న పీడీ ఎస్ బియ్యం లోడు లారీని తిమ్మాపురం పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా పెద్దిపాలెం నుంచి శ్రీలక్ష్మీ వెంకటేశ్వర లారీ సర్వీసుకు చెందిన లారీలో పీడీఎస్‌కు చెందిన బియ్యం లోడు అక్రమంగా రవాణా అవుతుందని 112 కాల్ ద్వారా పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పీడీఎస్ బియ్యం లోడు లారీని శుక్రవారం తెల్లవారుజామున 1.50 గంటలకు పండూరు జంక్షన్‌వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా లోడు లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపా రు. ఈ బియ్యం లోడు లారీ విశాఖజిల్లా పెద్దిపాలెం నుంచి వరంగల్ జిల్లాకు వెళుతున్నట్లు రసీదులో ఉందన్నా రు. కానీ లోడు లారీ కాకినాడ పోర్టుకి సరు కు రవాణా అవుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా అదుపులోకి తీసుకున్న బి య్యం లోడు లారీని జిల్లా పౌరసరఫరాల శాఖ గోదాములకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపా రు. సీజ్‌చేసిన లారీలో 520 బియ్యం బస్తాల్లో 258.18 క్వింటాళ్ల సరుకు ఉన్నట్లు మండల సివిల్ సప్లయిస్ అధికారిణి మమత తెలిపారు. వీటిని ఎంఎల్ఎస్ పాయింట్‌కి అప్పగించారన్నారు. సేకరించిన శాంపుల్స్‌ని పరీక్షకోసం జిల్లా మేనేజర్ ద్వారా పంపించి నిర్ధారణ చేస్తామ ని, నిందితులపై 6ఏ కేసు నమోదుకు సిపార్స్ చేస్తామన్నారు.

## చెట్లు నరికిన వైసీపీ మండలాధ్యక్షుడిపై కేసు

గోకవరం, ఏప్రిల్ 6: వైసీపీ గోకవరం మండలాధ్యక్షుడు పాటి రాంబాబుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన వైసీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు అదే గ్రామంలోని సుందరమ్మ సత్రం భూములను లీజుకు తీసుకొని సాగు చేస్తున్నాడు.ఈ క్రమంలో లీజుకు సాగు చేస్తున్న పొలంలో కొన్ని జీడిమామిడి చెట్లను అక్రమంగా నరికి బయటకు తరలించినట్లు ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో రాంబాబుపై వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు శనివారం ఎస్ఐ నాగరాజు తెలిపారు.

## వైసీపీ ప్రచారంలో భవిత కేంద్రం ఆయా

● ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తున్న అధికార పక్షం

సీతానగరం, ఏప్రిల్ 6: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన భర్తను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్న రాజానగరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జక్కంపూడి రాజా సతీమణి జక్కంపూడి రాజశ్రీతో కలసి సీతానగరం భవిత కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న రాజేశ్వరి అనే మహిళ నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సంఘటన పలు విమర్శలకు తావిస్తోంది. తరచూ ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కుతున్న వైసీపీ చర్యల్లో ఇదొక మచ్చుతునక. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేస్తున్నా అధికార పార్టీ నాయకులు మాత్రం తమ దారి తమదే అన్నట్టు ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంగిస్తూనే ఉన్నారు. ఒక వైపు ప్రభుత్వ జీతం తీసుకుంటూ మరోవైపు ఒక రాజకీయ పార్టీ తరుపున నేరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటున్నా ఉద్యోగుల్లో మార్పులు రావడం లేదు. ఇటువంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు.



ఎమ్మెల్యే రాజా సతీమణి రాజశ్రీతో ఎన్నికల ప్రచారంలో భవిత కేంద్రం ఆయా

## కాకినాడ జిల్లా స్వీప్
# అంబాసిడర్‌గా యశస్వి



యశస్వీని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ నివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 6: ఓటుహక్కు వినియోగంపై యువతలో చైతన్యాన్ని తీసుకువచ్చే లక్ష్యంతో ప్రముఖ సినీగాయకుడు జీ-సరిగమప కార్యక్రమ విజేత యశస్వి కొండేపూడిని కాకినాడ జిల్లా స్వీప్ ప్రోగ్రాం అంబాసిడర్‌గా నియమించినట్లు జిలా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను ఆయన మర్యాదపూర్వంగా కలిశారు. లోక్‌సభ, శాసనసభ సాధారణ ఎన్నికలు 2024 కు సంబంధించి ఓటర్లలో చైతన్యం అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లాలో స్విప్ కార్యక్రమాలు వినూత్నంగా చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● తెలంగాణవాసి దుర్మరణం, ఇద్దరికీ గాయాలు



మృతి చెందిన పట్టెం రాజు

ఎటపాక, ఏప్రిల్ 6: అల్లూరి జిల్లా ఎట పాక మండలం నెల్లిపాక, చోడవరం గ్రామాల మధ్యలో జాతీయ రహదారిపై శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్న ఘటనలో తెలంగాణ వాసీ దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామానికి చెందిన పెట్టెం రాజు (30) ఓ పని నిమిత్తం నెల్లిపాకకు వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై భద్రాచలం వైపు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో భద్రాచలం ఆసుపత్రికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామైన నెల్లిపాకకు గ్రామ వలంటీర్ మడివి కమల ఆమె కొడుకు చందు వస్తున్నారు. ఈనేపథ్యంలో నెల్లిపాక- చోడవరం గ్రామాల మధ్యలోని అంతరాష్ట్ర చెక్‌పోస్టు సమీపంలో ఈరెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో తలకు, చాతిభాగంలో తీవ్ర గాయాలైన పెట్టెం రాజు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వలంటీర్ కొడుకు చందుకి తీవ్ర గాయాలయ్యాయి. కమలకు స్వల్ప గాయాలతో బయట పడింది. క్షతగాత్రులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

అంబాజీపేట, ఏప్రిల్ 6: కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు పరిధిలోని గొల్లగుంట గ్రామానికి చెందిన కడలి వెంకటరమణ(50) తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ కె.చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లగుంటకు చెందిన వెంకటరమణ 15 ఏళ్ల క్రితం భార్య, పిల్లలు వదలి వెళ్లడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున అతని ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ మేరకు అతని సోదరుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ఈజీమనీ కోసం బైక్‌ల చోరీ

● పోలీసులకు చిక్కిన నలుగురు సభ్యుల ముఠా
● 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్న పట్టణ పోలీసులు



బైక్‌ల చోరీకి పాల్పడుతున్న ముఠా సభ్యులను పట్టుకున్న పట్టణ పోలీసులు

మండపేట, ఏప్రిల్ 6: జల్సాలకు అలవాటుపడి చేడు వ్యసనాలకు బానిసలై ఈజీమణి కోసం దొంగతనాలను వృత్తిగా ఎంచుకుని బైక్‌ల చోరీకి పాల్పడున్న ముఠా సభ్యులను పట్టుకుని పట్టణ పోలీసులు గుట్టు రట్టుచేశారు. మండపేట పట్టణ ఎస్.ఐ హరికోటి శాస్త్రి తెలిపిన వివ రాల ప్రకారం పట్టణంతోపాటు ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో బైక్‌లు చోరీకి పాల్పడే ముఠా సభ్యులను శనివారం అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈనెల 4న మండపేటకు చెందిన వ్యక్తి బైక్ చోరీకి గురైంది. బైక్‌ను పోగొట్టుకున్న బాధితుడు పట్టణ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ వేగవంతం చేశారు. బైక్ చోరీలు జోరుగా జరుగుతున్న నేపథ్యంలో కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట సీ.ఐ అఖిల్‌జమా, పట్టణ ఎస్.ఐ హరికోటిశాస్త్రి, ఇద్దరు కానిస్టేబుల్స్‌తో బృందాన్ని ఏర్పాటు చేశారు. వారు నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈనేపథ్యంలో శనివారం పట్టణంలో సంఘం కాలనీ రోడ్డు సమీ పంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా ఈజీమణి కోసం అలవాటుపడి, చేడు వ్యవసనాలకు లోనై బైక్‌లను చోరీకి పాల్పడుతున్నట్టు విచారణలో అంగీకరించటంతో పాటు చోరీలకు పాల్పడిన బైక్‌ల వివరాలను పోలీసుల రాబట్టారు. చోరీకి పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులు పథకం ప్రకారం చోరీలకు పాల్పడుతుంటారని పోలీసులు చెప్పారు. గోకవరం మండలం మొల్లేటి మల్లవరంనకు చెందిన ముచ్చకర్ల ప్రసాద్, బురుకట్ల కటాస్వా ములు, మండపేట మండలం ఇప్పనపాడుకు చెందిన మొక్క అప్పారావులను అదుపులోకి తీసు కుని అరెస్టు చేశామన్నారు. నిందితులు ఉమ్మడి జిల్లాలోని మెట్టప్రాంతాలైన జగ్గంపేట, ఏలేశ్వరం, పెద్దాపురం, మండపేట పట్టణంతోపాటు, విశాఖలో రెండుచోట్ల చోరీలకు పాల్పడినట్లు ముఠా సభ్యులు అంగీకరించరని ఎస్.ఐ తెలిపారు. వారివద్ద నుంచి ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ.5లక్షలు వరకు ఉంటుందని ఎస్.ఐ తెలిపారు. చోరీలు చేసిన బైక్‌లను మండపేట పట్టణంలోని గొల్లపుంత టిడ్కో గృహాల వద్ద దాచి ఉంచారని పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని ఆలమూరు కోర్టులో హాజరుపర్చగా ఈనెల 12వరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకున్న రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, సీఐ అఖిల్‌జమా. ఎస్ఐ హరికోటిశాస్త్రి, కానిస్టేబుల్స్ సతీష్, రమేష్‌లను జిల్లా ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

## ఉండ్రాజవరంలో ఇద్దరు దొంగలు అరెస్టు

● 17 మోటారు సైకిళ్ల స్వాధీనం



ఇద్దరు బైక్ దొంగలను పట్టుకున్న పోలీసులు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 6: మోటారుసైకిళ్ల దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సీఐ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఉండ్రాజవరం పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిడదవోలుకు చెందిన బొద్దూరి సతీష్, సమిశ్రగూడేనికి చెందిన తాతోలు రామకృష్ణ 17 మోటారుసైకిళ్ల దొంగతనం చేసినట్టు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.8.50లక్షలు ఉంటుందని చెప్పారు. ఉండ్రాజవరం పోలీసు స్టేషన్ పరిధిలో 2 కేసులు, తణుకులో 2, రాజమహేంద్రవరంలో 4, కొవ్వూరులో 3, పాలకొల్లు, ఏలూరు, గణపవరం, భీమవరం, నిడదవోలు, వీరవాసరం స్టేషన్లలో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదైనట్టు ఆయన వివరించారు. మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపర్చినట్టు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలన అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్

## స్ట్రాంగ్ రూమ్స్ పరిశీలించిన కలెక్టర్

జగ్గంపేట, ఏప్రిల్ 6: జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏబీఎస్ స్ట్రాంగ్ రూమ్స్‌లను శనివారం సాయంత్రం కలెక్టర్ నివాస్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్వో శ్రీనివాసరావు, ఎమ్మార్వో, ఎంపీడీవో, సిబ్బంది ఉన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది కీలక పాత్ర

### డాక్టర్ భవానీరావ్


మాట్లాడుతున్న డాక్టర్ భవానీరావ్

జీజీహెచ్(కాకినాడ), ఏప్రిల్ 6: ఆధునిక వైద్యశాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ది కీలక పాత్ర అని గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్‌సర్) సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.భవానీరావ్ అన్నారు. కాకినాడ రంగరాయ వైద్యకళాశాల ఆధ్వర్యంలో శనివారం గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మజ బృందం పర్యవేక్షణలో జీజీహెచ్ ప్రాంగణంలోని ఎస్‌పీఎం గ్యాలరీలో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ భవానీరావ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అపిలికేషన్ ఆఫ్ ఏఐ ఇన్ మెడిసిన్ అంశంపై ఆయన మాట్లాడారు. వైద్యశాస్త్ర అనుబంధ సాంకేతిక విప్లవంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర వహిస్తుందన్నారు. దేశ, విదేశాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో నిర్వహించిన కీలక శస్త్రచికిత్సలు, అందించిన వైద్యసేవలు, అందిస్తున్న ఆరోగ్య సంస్థల వివరాలను ఆయన వెల్లడించారు. డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.లావణ్యకుమారి కలిసి డాక్టర్ భవానీరావ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్‌లు డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ దేవిమాధవి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

## వెంకటాపురంలో ఉచిత వైద్య శిబిరం



వెంకటాపురంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గండేపల్లి, ఏప్రిల్ 6: సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి రూ.10వేలు విలువగల మందులను ఉచితంగా పంపిణీ చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. ద్వారంపూడి శ్రీనివాస్, ద్వారంపూడి మణికంఠ చక్రవర్తి, ముంగి గంగాధర్, ముంగి రాము, ముంగి ప్రసాద్, సలాది స్వామి, బోడెం మణికంఠ, బోడెం వీరేంద్ర, అడబాల శివన్నారాయణ, మువ్వ మణికంఠ, వెంకటాపురం గ్రామ యూత్ మెంబర్స్ ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పి. ప్రశాంతి, రేణుక, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు.

### ముగిసిన శిక్షణా తరగతులు

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల పెట్రోలియం విభాగం నందు ఇండస్ట్రియా ఆటోమేషన్ విత్ పీఎల్‌సీ అనే అంశంపై రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఐదురోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు ముగిశాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఏపీఎస్‌డీసీకి చెందిన ఎం.కులదీప్‌కుమార్ శిక్షణ అధిపతిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్‌రెడ్డి, పెట్రోలియం విభాగం అధిపతులు డాక్టర్ ఆర్.గిరిప్రసాద్, కోఆర్డినేటర్స్ తదితరులున్నారు.

## ఆర్టీసీ బస్సు చక్రాల నుంచి పొగలు


బస్సు చక్రాల నుంచి వస్తున్న మంటలను ఆర్పుతున్న సిబ్బంది

సామర్లకోట, ఏప్రిల్ 6: సామర్లకోట పట్టణ పరిధి మెహెర్ కాంప్లెక్స్ సమీపాన రాజమండ్రి నుంచి కాకినాడకు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రాల నుంచి పొగలు వ్యాపించడంతో ప్రమాదాన్ని ముందుగా గుర్తించి బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి రోడ్డు పక్కకు చేర్చి బస్సును నిలిపివేసి ప్రయాణికులందరినీ కిందికి దించేశారు. రాజమండ్రి నుంచి కాకినాడకు వస్తుండగా సామర్లకోట మెహెర్ కాంప్లెక్స్ వద్దకు వచ్చేసరికి ఈ సంఘటన జరిగింది. అనంతరం బకెట్లతో నీటిని తీసుకువచ్చి బస్సు చక్రాలపై పొగలు వస్తున్న ప్రాంతంలో పోసి ప్రమాదాన్ని నివారించారు. అప్రమత్తంగా వ్యవమరించిన బస్సు డ్రైవర్‌ను పలువురు అభినందించారు.

## పగలు వీధి దీపాల వెలుగులు!



ఏలేశ్వరం, ఏప్రిల్ 6: పట్టణంలో వీధి దీపాలు నిత్యం పగలూ రాత్రి తేడాలేకుండా వెలుగులు విరజిమ్ముతున్నాయి. సాయినగర్, దిబ్బలపాలెం, సువ్వయ్యమ్మపేట, శివాలయం పలు వీధుల్లో పగటి పూట కుడా దీపాలు వెలుగుతూనే ఉండడంతో విద్యుత్ బిల్లు తడిసియోపుడవుతుంది. ఇప్పటికే ప్రతీనెలా నగర పంచాయితీ రూ.1.30వేలు బిల్లుగా చెల్లిస్తుంది. విద్యుత్ పొదుపు చర్యలు పాటించకపోవడంతో నగరపంచాయితీపై అధనపు ఆర్థిక భారం పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ పొదుపు తదితర జాగ్రత్తలను పాటించాల్సిన అధికారులు తమకేమి సంబందంలేనట్టు ఉంటున్నారు. ఇకనైనా వీధి దీపాల నిర్వహణను సక్రమంగా నిర్వర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు అండగా టీడీపీ నేతలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 6: విశాఖ సముద్ర జలాల్లో చేపల వేట సాగిస్తున్న బోటులో సిలిండర్ పేలి సంభవించిన అగ్నిప్రమాదంలో గాయాలపాలైన కాకినాడ- జగన్నాథపురం ప్రాంతానికి చెందిన మత్స్యకారులకు టీడీపీ నేతలు అండగా నిలిచారు. ఈ మేరకు విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని అక్కడి టీడీపీ నేత భరత్, గండి బాబ్జి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అండగా నిలిచారు. ఈ ప్రమాదంలో 60శాతంపైగా శరీరం కాలి చికిత్స పొందుతున్న ముగ్గురి పరిస్థితి తీవ్రంగా ఉందని, మిగిలిన ఆరుగురు కోలుకుంటున్నారని వైద్యుల ద్వారా తెలుసుకున్నారు.చేపలవేటకు వెళ్లే బోట్లలో సరైన రక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## ఘనంగా సంగీత వేడుకలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 6: శ్రీప్రకాష్ విద్యాసంస్థలు కాకినాడలో నిర్వహించిన హరివిల్లు కార్యక్రమానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమ వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ముఖ్యఅతిథులుగా పీవీ నరసింహహారావు కుమార్తె వాణిదేవి, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ డి.రామగణేష్, నటి గీత భాస్కర్, శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్, సమీర, ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి హాజరయ్యారు. విద్యార్థులు భారత్, వివిధ దేశాలకు చెందిన ప్రముఖ పండుగల అనేక చిత్రాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథులకు జ్ఞాపికలు అందించారు.

## ఇఫ్తార్ విందులో కొండబాబు ప్రార్థనలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 6: కాకినాడ-జగన్నాథపురంలోని మసీద్-ఏ-ఆజామ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాకినాడ సిటీ అసెంబ్లీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు ప్రార్థనలు చేశారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు ఏహెచ్‌కే దురాని, ఇమామ్ గౌస్ మొహిద్దీన్ హబీబీ, ఎండీ అన్సర్, ఎండీ ఖాన్, ఖాదర్ అలీఖాన్, ఎస్‌కే మౌలానా, జమీల్, మన్సూర్ పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో పర్యటన

ప్రత్తిపాడు, ఏప్రిల్ 6: యునైటెడ్ మానవ హక్కుల సంరక్షణ కౌన్సిల్ జాతీయ లీగల్ కార్యదర్శి స్వతంత్ర అభ్యర్థి పిల్లి బలరాముడు మండలంలోని ఉలిగోగులు మెట్టిచింత, గిరిజనాపురం గ్రామాల్లో శనివారం పర్యటించారు. మారుమూల గ్రామాల అభివృద్ధి, సంక్షేమానికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చేందుకు తాను స్వతంత్ర అభ్యర్థిగా జగరబోవు నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు తెలిపారు. తన మేనిఫెస్టోలోని అంశాల కరపత్రాలను గిరిజన గ్రామాల్లో పంపిణీ చేశారు.

## ముద్రగడ పరామర్శ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 6: మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బుద్దరాజు చంటిరాజును శనివారం మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. ఇటీవల చంటిరాజు హృదయ సంబంధిత వ్యాధితో అనారోగ్యానికి గురై ఇంటి వద్ద కోలుకుంటుండగా ముద్రగడ కలిసి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్ గణేశుల రాంబాబు, ముద్రగడ అనుచరులు గణేశుల రాంబాబు, గౌతుస్వామి, గణేశుల లచ్చబాబు తదితరులున్నారు.

# బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయం

» జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ » పలుచోట్ల కూటమి అభ్యర్థుల ప్రచారం

గండేపల్లి, ఏప్రిల్ 6: రైతుల సంక్షేమం, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలో యల్లమిల్లి, నాయకంపల్లి గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనలో రైతు సంక్షేమం పూర్తిగా కుంటిపడిందన్నారు. మధ్యతరగతి వారు చాలా ఇబ్బందులకు గురయ్యారన్నారు. అవ్వతాతలకు ఇవ్వాల్సిన పింఛను సమయానికి ఇవ్వకుండా అవి కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ చేశారన్నారు. వైసీపీని ఇంటికి పంపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలను కూడా వారికి రావాల్సిన పథకాలు తీసేసి పూర్తిగా అణగదొక్కారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత జూన్ పింఛను రూ.3వేలు, జులైలో పెంచిన పింఛను రూ.4వేలు పెంచిన పెన్షన్‌తో రూ.7వేలు అవ్వతాతలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. మళ్లీ రాష్ట్రంలో సంపూర్ణ అభివృద్ధి జరగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీఎస్ అప్పలరాజు, టీడీపీ మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, కందుల చిట్టిబాబు, కుంచే రాజా, సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ, పెనుమర్తి భాస్కరరావు, మాదిరెడ్డి కృష్ణార్జున, ఉండవిల్లి వీర్రాజు, మద్దుపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

**కిర్లంపూడి:** రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత సర్వారాయుడు అన్నారు. టీడీపీ సీనియర్ నేత గంధం ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, పోకల దొరబాబు ఆధ్వర్యంలో రాజుపాలెంలో ఇంటింటా పర్యటిస్తూ సైకిల్ గుర్తుపై ఓటేసి నెహ్రూను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, చదరం చంటిబాబు, కొల్లా రాజారావు, కంటా శ్రీను, బస్వా వీరబాబు, జ్యోతుల రాంబాబు పాల్గొన్నారు. ముక్కొల్లు, రామకృష్ణపురం గ్రామాల్లో టీడీపీ దళితగళం ప్రచారం నిర్వహించారు. మూరా సత్తిబాబు, దారా ఏసురత్నం, హరీష్, కాదే ఏసు, బూసియ్య, సత్తిబాబు ఉన్నారు.

### వైసీపీ డిపాజిట్లు కోల్పోవడం ఖాయం

**పిఠాపురం:** వైసీపీ నేతల మోసపూరిత మాటలను ప్రజలను నమ్మరని, ఆ పార్టీ నేతలు డిపాజిట్లు కోల్పోవడం ఖాయమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలోని 5,6,7,9వార్డులు, మండలంలోని చిత్రాడ గ్రామాల్లో ఆయన శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పొత్తులో భాగంగా పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పింఛన్లు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. తన హయాంలో నియోజకవర్గాన్ని రూ.2,800కోట్లుతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అభివృద్ధిపై వైసీపీ నేతలు చర్చకు రావాలని సవాల్ చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి సూర్యప్రకాష్, పట్టణ, మండలశాఖ అధ్యక్షులు రెడ్డెం భాస్కరరావు, సకుమళ్ల గంగాధర్, నాయకులు పిల్లి చిన్నా, బంగారు ద్వారక, ఆలపు దొరబాబు, మోర్త పండు, సోము సత్యనారాయణ, బొజ్జా సతీష్, సూరవరపు సుబ్బారావు, మొల్లి నాగమరిడిరాజు, అల్లవరపు నగేష్, కోళ్ల బంగారుబాబు, రాయుడు శ్రీను, కొరుప్రోలు శ్రీను, అడ్డగర్ల శివ, మిడతాన బాబులు తదితరులున్నారు.


పిఠాపురం: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వర్మ

### టీడీపీతోనే మైనారిటీల అభివృద్ధి

**కాకినాడ సిటీ:** మైనారిటీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉండి అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందుతాయని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 26వ డివిజన్‌లో మైనారిటీ నాయకులతో కలిసి ఆయన పర్యటించి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వ విధ్వంసకర, అవినీతి, అరాచక, డ్రగ్స్, గంజాయి, రౌడీ, గూండాల పాలన నుంచి మన కాకినాడను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఎంఏ తాజుద్దీన్, ఎండీ అన్సర్, సంగాని నాగూర్, సంగాని గంగాధర్, జమీల్, పాలెపు రాజు, మన్సూర్ పాల్గొన్నారు.

### అరాచక పాలన నుంచి విముక్తి

**సర్పవరం జంక్షన్:** సీఎం జగన్ అరాచక పాలన నుంచి ప్రజలకు త్వరలో విముక్తి రానుందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయంతో అంతటా పండుగ వాతావరణం ఉంటుందని కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. కార్పొరేషన్ 49వ డివిజన్ సోమాలమ్మ గుడి నుంచి ఉమ్మడిగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, అరాచక పాలనతో అన్ని వర్గాలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ-జనసేన,బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించి ఎమ్మెల్యే,ఎంపీ ఓట్లు గాజుగ్లాసు గుర్తుపై వేయాలని కోరారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, టీడీపీ రాష్ట్ర వైద్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ పాలిక ఉషారాణి పాల్గొన్నారు.


గండేపల్లి మండలం యల్లమిల్లిలో నెహ్రూకు హారతి ఇస్తున్న మహిళ

### వైసీపీని నమ్మవద్దు

**తాళ్లరేవు:** దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి డోర్‌డెలివరీ ఇచ్చిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును ప్రోత్సహిస్తున్న వైసీపీని నమ్మవద్దని టీడీపీ నేతలు ప్రజలను కోరారు. శనివారం పి.మల్లవరంలో టీడీపీ రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించి వైసీపీ హత్యానేరాలను వివరించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు మంచిరోజులు వస్తాయని అందరు ఆనందాలతో ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దున్నా సుబ్రహ్మణ్యం, దూళిపూడి సుబ్బారావు, ఇల్ల సత్యనారాయణ, వంగరాల వెంకటేశ్వరరావు,దున్నా మురళి తదితరులు పాల్గొన్నారు.

### సూపర్‌సిక్స్ పథకాలతో మేలు

**అన్నవరం:** ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ, జనసే, బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ ఇంటింటా ప్రచారాన్ని గ్రామశివారు కొత్తపేట కాగితాలమ్మకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో పేదల జీవితాలు మారతాయని, జగన్ ప్రభుత్వంలో అడుగడుగునా దోపిడి రాజ్యమేలుతుందన్నారు. నాయకులు వెన్నా శివ, బద్ది రామారావు, పిల్లి ప్రసాద్, పసుపులేటి చక్రి, సరమర్ల మధుబాబు, మెరపల నరసయ్య, పంచదార్ల సత్యనారాయణ, కడుపుకుట్ల కృష్ణ తదితరులు ఉన్నారు.

### సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన

**కోటనందూరు:** టీడీపీ అమలుచేసే సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు అన్నారు. మండలంలోని బిళ్లనందూరులో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నివర్గాలకు టీడీపీతోనే అభివృద్ధి అన్నారు. మాజీ జడ్పీటీసీ పెట్ట ఒంకోట భాస్కరసత్యనారాయణ, అంకంరెడ్డి రమేష్, పోతల సూరిబాబు, అంకంరెడ్డి బుల్లిబాబు మారుతీరావు, బైలపూడి శ్రీరామమూర్తి, మాతిరెడ్డి బాపిరాజు పాల్గొన్నారు.

## సూర్యుడి ప్రతాపానికి ఉక్కిరిబిక్కిరి


నిర్మానుష్యంగా ఉన్న సామర్లకోట ఏడీబీ రోడ్డు

సామర్లకోట, ఏప్రిల్ 6: సూర్యుడి ప్రతాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓ వైపు ఎండల తీవ్రత, మరో వైపు ఉక్కబోత వడగాల్పులతో అల్లాడిపోతున్నారు. శనివారం సామర్లకోటలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకారు. ఎండ తీవ్రతకు ఉదయం నుంచే సామర్లకోట పట్టణం, మండలంలోని పలు గ్రామాల రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ప్రధాన రహదారులపై జనసంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు పనిచేయక ప్రజలు మగ్గిపోతున్నారు. వృద్ధులు, చిన్నారులు, రోగుల బాధలు వర్ణనాతీతం. రానున్న వారం ఎండల తీవ్రత మరింత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### నిర్మానుష్యంగా మారిన రోడ్లు

తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలని వారు చెబుతున్నారు. వీలైనంత వరకూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకూ బయట తిరగకపోవడం ఉత్తమమని సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ భవ్యశ్రీ చెప్పారు.

**ప్రత్తిపాడు:** మండలంలో శనివారం వాతావరణం నిప్పుల కొలిమిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడు భగభగ మండడంతో ప్రజలు విలవిలలాడారు. తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం, దీనికి తోడు విద్యుత్‌సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకవైపు ఉక్కపోత, మరోవైపు కరెంటు సరఫరా నిలుపుదలతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

**తుని రూరల్:** సూర్యుడు తాపం రోజురోజుకు పెరుగుతుంది. శనివారం పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు చేరడంతో ఉదయం 8 నుంచి సాయంత్రం 6గంటల వరకు వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు జనాలు బయటకు రాకపోవడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎండ తీవ్రత, వడగాల్పులు నుంచి రక్షణ పొందడంపై అవగాహన కల్పిస్తున్నట్టు ఏరియా ఆసుపత్రి వైద్యులు చెప్తున్నారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


ప్రత్తిపాడులో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న కన్వీనర్ బాలు దొర

ప్రత్తిపాడు, ఏప్రిల్ 6: ప్రత్తిపాడులో బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గంటా బాలుదొర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అభివృద్ధి ఫలాలు చిట్టచివరి వ్యక్తికి అందడమే లక్ష్యంగా ప్రధాని మోదీ సారథ్యంలో బీజేపీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ సింగిలిదేవ్ సత్తిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు గెట్టం వెంకటరమణ, మండలాధ్యక్షుడు కందా వీరాస్వామి, నాయకులు ఉమ్మడి వెంకట్రావు, రెడ్డి లోవరాజు, కూరాకుల రాజా, చింతాకుల రామకృష్ణ, ఇంటి వీర నాగేశ్వరరావు, దేవర రామకృష్ణ, ఊట వీరబాబు, గణేష్, కృష్ణారావు,గంగాధర్ తదితరులున్నారు.

### పిఠాపురంలో...

పిఠాపురం, ఏప్రిల్ 6: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ బుర్రా వరుణ్ కృష్ణంరాజు బీజేపీ పతాకాన్ని ఎగురవేశారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం ప్రపంచంలోనే ప్రముఖ స్థానం సాధించిందని తెలిపారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


పిఠాపురంలో బీజేపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

## గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 6: కాకినాడ అర్బన్ పెదపూడిలో శనివారం విలేజ్ హెల్త్ శానిటేషన్, న్యూట్రిషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు వారి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గర్భిణులు 1590 మంది, బాలింతలు 1290 మంది, పిల్లలు 6788 మందికి రైస్, దాల్, ఆయిల్, పాలు, గుడ్లు పంపిణీ చేశారు.

## టీడీపీలో చేరికలు


సామర్లకోట: చేరికల అనంతరం ప్రసంగిస్తున్న రాజప్ప

సామర్లకోట, ఏప్రిల్ 6: తెలుగుదేశం పార్టీలోకి సామర్లకోట మండలం కాపవరం గ్రామానికి చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు శనివారం సాయంత్రం చేరారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, దొరబాబు, రాయవరపు కృష్ణారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చినరాజప్ప పలువురు కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి అభినందించారు. అరాచక వైసీపీ ప్రభుత్వంపై పోరాటాలు సాగిస్తున్న టీడీపీలోకి చేరేందుకు ముందుకు వస్తున్న ప్రతీ ఒక్కరినీ తమ పార్టీలోకి స్వాగతిస్తామని రాజప్ప చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడబోతుందన్నారు. టీడీపీలోకి చేరిన ప్రతీ ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతోనే ఏపీకి నిజమైన సంక్షేమం వస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్దాపురం జనసేన ఇన్‌చార్జి తుమ్మల బాబు, బీజేపీ ఇన్‌చార్జి విత్తనాల వెంకట రమణ, టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనుబాబు, ముత్యం రాజబాబు, గుమ్మళ్ళ రామకృష్ణ, అడ్డాల వెంకన్నబాబు, కుర్రా నారాయణ స్వామి, కొప్పిరెడ్డి రాజా, కుంచం శ్రీను, కుంచం సతీష్, వింటి బాబ్జీ, సోమరాజు పాల్గొన్నారు.

**తాళ్లరేవు:** సమస్యలను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వంలో నడవలేక పోలేకుర్రు శెట్టిబలిజీలు శనివారం మురమళ్లలో ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబును కలసి టీడీపీలో చేరారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్, జక్కల ప్రసాద్‌బాబుల నాయకత్వంలో శెట్టిబలిజీలు బుచ్చిబాబును కలసి పోలేకుర్రు అభివృద్ధికి కృషిచేస్తే టీడీపీతో నడుస్తామని అన్నారు. బుచ్చిబాబు మాట్లాడుతు పోలేకుర్రులో అభివృద్ధిని అన్నివర్గాలకు సమానంగా చేస్తానని, ఎవ్వరికీ ఎటువంటి అన్యాయం జరగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు.

## ప్రత్యేక పోలీస్ బలగాలతో కవాతు

కాకినాడ క్రైం, ఏప్రిల్ 6: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకునేలా ప్రత్యేక సాయుధ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు ఎక్కడికక్కడ ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో ధైర్యం నింపేలా పోలీసులు, బలగాలు కవాతు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కె.హనుమంతరావు ఆధ్వర్యంలో శనివారం టూటౌన్ పోలీస్ పరిధిలో ఎస్‌హెచ్‌వో నాగేశ్వర్‌నాయక్ బృందం పేర్రాజుపేట, విముక్తికాలాని, ఆర్‌టీసీ కాంప్లెక్స్, గాంధీనగర్, ఎల్విన్‌పేట, తదితర ప్రాంతాల్లో టూటౌన్ పోలీసులు ప్రత్యేక పోలీస్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఎస్‌డీపీవో హనుమంతరావు మాట్లాడుతూ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ఓటర్లకు భరోసా కల్పించేందుకు కవాతు చేపట్టామన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ


తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, ఏప్రిల్ 6: సత్యదేవుడికి వారాంతపు సేవయిన ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై తీసుకుని వచ్చారు. పండితులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతి, సూపరెంటెండెంట్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఆహార పరిరక్షణపై అవగాహన


గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట, ఏప్రిల్ 6: జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ ఆదేశాల ప్రకారం రాజపూడి సెక్టార్ సూపర్‌వైజర్ అమ్మాజీ రాజపూడి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆరోగ్య ఆహార పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణి అయిన దగ్గర నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు 1000 రోజులు ప్రాముఖ్యత వివరించి, ఏఏ సమయాల్లో ఏ ఆహారం తీసుకోవాలి, ఏ విధమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి అనే విషయాలను పీహెచ్‌ఎన్ వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమ్మాజీ, పీహెచ్ఎన్ లోవలక్ష్మి, ఎంఎల్ హెచ్‌వో సూర్యకుమారి, ఏఎస్ఎం భవాని, పండమ్మ, మహిళా పోలీసు భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, కృష్ణవేణి, సుబ్బలక్ష్మి, కిశోర్, తల్లులు, బాలికలున్నారు.

## కారులో తరలిస్తున్న నగదు స్వాధీనం


పిఠాపురంలో స్వాధీనం చేసుకున్న నగదు

పిఠాపురం, ఏప్రిల్ 6: కారులో తరలిస్తున్న నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సామిల్లుకు చెందిన సామాగ్రిని కొనుగోలు చేసేందుకు పిఠాపురం నుంచి రాజమహేంద్రవరానికి మిల్లు నిర్వాహకుడు బయలుదేరారు. పిఠాపురం-సామర్లకోట రోడ్డులో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు కారుని తనిఖీ చేయగా రూ. 1.88లక్షల నగదు ఉన్నట్టు గుర్తించారు. వీటికి బిల్లులు, రశీదులు, ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్ ఇన్‌చార్జి ఆర్వీ ప్రసాద్ ఉన్నారు.

## 21 మద్యం సీసాలు పట్టివేత

కిర్లంపూడి, ఏప్రిల్ 6: అక్రమంగా తరలిస్తున్న 21మద్యం సీసాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. రాజుపాలెం గ్రామంలో శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తుండగా స్కూటీలో 21మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసి కిర్లంపూడి ఎస్ఐ జబీర్‌కు అప్పగించినట్టు స్క్వాడ్ అధికారి మక్కా చిన్నారావు తెలిపారు.

## 100 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

జగ్గంపేట, ఏప్రిల్ 6: మల్లిశాల గ్రామ శివారున సారా అమ్మకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు జగ్గంపేట ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. మల్లిశాల గ్రామానికి చెందిన గీసాల రమణ సారా అమ్మకానికి తరలిస్తుండగా అతడిని పట్టుకున్నారు. 100 లీటర్ల సారా సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

## గంగాలమ్మ జాతర ప్రారంభం

తొండంగి, ఏప్రిల్ 6: ఏవినగరం గ్రామంలో వేంచేసిన గంగాలమ్మ జాతర మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యింది. కొత్త అమావాస్యను పురస్కరించుకుని జాతర 3రోజుల పాటు కొనసాగనుంది. అమ్మవారి ఆలయం వద్ద శనివారం రాత్రి భక్తులు పెద్ద ఎత్తున గండదీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. తుని టీడీపీ కూటమి అభ్యర్థి యనమల దివ్య, యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

## ప్రత్తిపాడులో అన్నదానం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 6: ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం అన్నదానం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలు భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి అనంతరం ప్రసాదాలు స్వీకరించారు.